ఓటర్ల జాబితాలో సవరణలకు 25 వరకు అవకాశం

బెంగళూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు, చిరునామా మార్పు, పేర్లు, వయస్సులలో నమోదైన తప్పులను సరిదిద్దుకునేందుకు ఈనెల 25 వరకు అవకాశం ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఓటర్స్ డాట్ ఇసిఐ డాట్ జిఓవి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సవరణలు చేసుకోవచ్చునని తెలిపింది. జనవరి 1నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కూడా ఓటు హక్కును పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఓటర్ల సమాచారం కోసం సహాయవాణి 1950కు కాల్ చేయవచ్చునని పేర్కొన్నారు.

కాంగ్రెస్ జాబితా సిద్ధం

- పూర్తయిన కసరత్తు
- నేడే విడుదల
- 20 స్థానాలు ఖాయం : డీకే శివకుమార్


ఢిల్లీలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు


సమావేశంలో ఖర్గే, సోనియాగాంధీ

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే తన అభ్యర్థుల జాబితాకు కాంగ్రెస్ తుది రూపం ఇచ్చింది. ఢిల్లీలో మంగళవారం రాత్రి పొద్దుపోయేంతవరకు పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ అభ్యర్థుల జాబితాపై తీవ్రంగా కసరత్తు చేసింది. గెలుపే లక్ష్యంగా బలమైన అభ్యర్థులను బరిలోకి దింపాలని నిర్ణయించింది. బుధవారం జాబితా విడుదల కానుందని కాంగ్రెస్ వర్గాలు సూచన ప్రాయంగా వెల్లడించాయి. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఢిల్లీకి వెళ్లారు. కేపీసీసీ తరపున ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో పేరును ఖరారు చేసి అధిష్టానానికి పంపినప్పటికీ రాష్ట్రంలో బీజేపీ-జేడీఎస్ పొత్తు దరిమిలా రాజకీయ సమీకరణలు మారిపోవడంతో మరో జాబితాను సిద్ధం చేశారు. బీజేపీ నుంచి వలస వచ్చిన ఒకరిద్దరు నేతలకు టిక్కెట్లు ఇవ్వాలని తీర్మానించారు. ఇప్పటికే 7 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ మిగిలిన 21 నియోజకవర్గాలకు ఒకేసారి జాబితా విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది.

నేడు కాంగ్రెస్‌ప్రణాళికా సమితి సభ

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికా కమిటీ సమావేశం కూడా ఢిల్లీలో బుధవారం జరుగుతుందని కేపీసీసీ అధ్యక్షుడు కూడా అయిన ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మీడియాకు చెప్పారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో బహుళ ప్రజాదరణ పొందిన ఐదు గ్యారెంటీ పథకాల్లో కనీసం కొన్నింటినైనా పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చే అంశాన్ని పరిశీలించాలని అధిష్టానాన్ని కోరుతామన్నారు.

గుట్టు విప్పని కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాపై ఇంతవరకు అటు కేంద్ర నాయకులుగానీ, ఇటు రాష్ట్ర నాయకులుగానీ గుట్టు విప్పడం లేదు. కాంగ్రెస్‌కు అభ్యర్థుల కొరత వల్లే జాప్యం జరుగుతోందని బీజేపీ ఎద్దేవా చేస్తుండగా నిజానికి అలాంటి పరిస్థితి బీజేపీకే ఉందని కాంగ్రెస్ విరుచుకుపడింది. బెంగళూరు దక్షిణ నుంచి సౌమ్యరెడ్డి బరిలోకి దిగడం దాదాపు ఖాయమని కాంగ్రెస్ వర్గాలు సూచన ప్రాయంగా అంటున్నాయి.

కాంగ్రెస్ జాబితా కోసం బీజేపీ ఎదురుచూపు



కాంగ్రెస్ జాబితా కోసం బీజేపీ ఎదురు చూస్తున్నట్లు సమాచారం. బీజేపీలోనూ ఇంకా ఐదు నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లను ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మూడో జాబితాను ఖరారు చేసేందుకు బీజేపీ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం కానుంది. ఇందులో బీజేపీ మిగిలిన 5 నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లను ప్రకటించే అవకాశం ఉంది. మొత్తం 28 నియోజకవర్గాలకు గాను ఇప్పటికే 20 మందితో బీజేపీ తొలి జాబితా ప్రకటించింది. పొత్తులో భాగంగా జేడీఎస్‌కు మూడు నియోజకవర్గాలు కేటాయించగా మిగిలిన 5 నియోజకవర్గాల పేర్లను బుధవారం ఖరారు చేసి ప్రకటించే అవకాశం ఉంది. జేడీఎస్‌కు మండ్య, కోలారు, హాసన్ నియోజకవర్గాలను కేటాయిస్తున్నట్టు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా మంగళవారం జేడీఎస్ అధినేత దేవెగౌడకు ఫోన్ చేసి చెప్పినట్టు సమాచారం. కాంగ్రెస్, బీజేపీ జాబితాలలో చివరిక్షణంలో ఒకటి రెండు మార్పులు చేసే అవకాశం లేకపోలేదని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

20 స్థానాలు ఖాయం : డీకే



గత శాసనసభ ఎన్నికల్లో స్వయంగా ప్రధాని మోదీ కాళ్లకు బలపాలు కట్టుకుని తిరిగినా బీజేపీ చిత్తుగా ఓడిందని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఢిల్లీకి బయల్దేరే ముందు బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్యారెంటీ పథకాలతోపాటు అభివృద్ధి ప్రధాన అజెండాగా ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. బీజేపీ ఎంతగా దుష్ప్రచారం చేసినా ఎన్ని వివాదాస్పద అంశాలు తెరపైకి తెచ్చినా కాంగ్రెస్ 20 స్థానాల్లో విజయం సాధించడం ఖాయమన్నారు.

ఎన్నికల వేళ...
భారీగా నగదు స్వాధీనం

- రూ.4.28 కోట్లు పట్టివేత

బెంగళూరు/బళ్లారి గాంధీనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఎన్నికల వాతావరణం నెలకొన్న నేపథ్యంలో కోట్లాది రూపాయలు అక్రమంగా డబ్బు రవాణా అవుతోంది. ఎన్నికల కమిషన్ జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ రవాణాపై నిఘా వేస్తోంది. ఎలాంటి రికార్డులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.4.28 కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండ్య జిల్లా మద్దూరు తాలూకా కొంగబోరనదొడ్డి వద్ద కారు డిక్కీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు కోటి రూపాయల నగదును ఎన్నికల సిబ్బంది సోమవారం రాత్రి స్వాధీనం చేసుకుంది. బెంగళూరు నుంచి మండ్య జిల్లాలోని కేఆర్‌పేటకు వెళ్తున్న కారును చెక్‌పోస్ట్ అధికారులు కొంగబోరనదొడ్డి వద్ద పరిశీలించగా అందులో రూ.99.20 లక్షల నగదు కట్టలు ఉన్న సంచిని గుర్తించారు. నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కారులో ఉన్న గిరీశ్‌ను ఎన్నికల అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. నగదుతోపాటు కారును సీజ్ చేసి మద్దూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అదే విధంగా విజయపుర జిల్లా పరిధిలో ఎలాంటి ఆధారాలు లేకుండా ఇన్నోవా వాహనంలో తరలిస్తున్న రూ. 2,93,50,000 సీఈఎన్ (సైబర్ ఎకనామిక్స్ అండ్ నార్కోటిక్స్) పోలీసులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. డబ్బు రవాణా చేస్తున్నట్లు ఖచ్చితమైన సమాచారం అందుకున్న పోలీసులు విజయపుర సీఈఎన్ క్రైమ్ పోలీసు ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ నందేశ్వర ఆధ్వర్యంలో సింధగి బైపాస్‌లో వాహనాలను తనిఖీ చేశారు. హైదరాబాద్ నుంచి హుబ్లీ వైపు వెళుతున్న మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ కలిగిన టయోటా కారులో ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న సాంగలియ బాలాజి నిక్కం, సచిన్ మోహిత్ అను ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విజయపుర జిల్లా ఎస్పీ ఋషికేశ్ సోనావణె తెలిపారు. దీంతో పాటు గంగావతి తాలూకా ఆనేగొంది కడేబాగిలు చెక్‌పోస్టు వద్ద రూ. 35లక్షల, 95వేల నగదును మంగళవారం పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు.


సీజ్ చేసిన రూ 2.93కోట్ల నగదును చూపుతున్న విజయపుర సీఈఎన్ పోలీసులు

645 బీఎంటీసీ బస్సుల ఉపసంహరణ

- హైకోర్టు ఆదేశాల ఫలితం

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరులో పదే పదే మొరాయిస్తూ ప్రయాణికులకు ఇబ్బందికరంగా పరిణమించిన బస్సులను తక్షణం ఉపసంహరించుకోవాలని రాష్ట్ర హైకోర్టు ఇటీవల చేసిన సూచన మేరకు రవాణాశాఖ కసరత్తు ప్రారంభించింది. బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ) ప్రస్తుతం 6,147 బస్సులు నడుపుతుండగా వీటిలో డీజిల్‌తో నడిచే బస్సులు 5,643, విద్యుత్‌తో నడిచే 504 ఉన్నాయి. వాతావరణ కాలుష్యాన్ని విరజిమ్ముతున్న బస్సుల విషయంలో బీఎంటీసీ కఠిన నిర్ణయాలు తీసుకోవాలని గతంలోనే హైకోర్టు సూచన చేసింది. పైగా ఇలాంటి పాతబస్సుల వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొంది. ఈ లెక్కన 12 ఏళ్లుగా సేవలందిస్తూ 11లక్షల కిలోమీటర్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న ఏసీ బస్సులను, 8.5 లక్షల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న జనరల్ కేటగిరీ బస్సులను గుర్తించి దశలవారీగా వాటిని సర్వీసుల నుంచి తొలగించనున్నారు. రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి ఈ అంశంపై మీడియాతో మాట్లాడుతూ కొత్త బస్సులతోపాటు డబుల్‌డెక్కర్ బస్సుల కొనుగోళ్లకు టెండర్లు పిలిచామని, త్వరలోనే ప్రక్రియ పూర్తి కానుందన్నారు. హైకోర్టు సూచనతో 645 బస్సులను ఉపసంహరిస్తున్నట్టు తెలిపారు.



ఆగిపోయిన బీఎంటీసీ బస్సును ముందుకు తోస్తున్న ప్రయాణికులు

జేడీఎస్‌తో పొత్తు కొనసాగుతుంది

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర



బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్‌తో తమ పొత్తు కొనసాగుతుందని, చిన్నచిన్న అపోహలు ఉంటే వాటిని సరిదిద్దుకున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర ప్రకటించారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పొత్తు సమయంలో చిన్న చిన్న అపోహలు రావడం సహజమన్నారు. పరస్పరం చర్చల అనంతరం కథ సుఖాంతమైందన్నారు. జేడీఎస్ నేతల గౌరవ మర్యాదలకు భంగం రాని రీతిలో తమ పార్టీ అధిష్టానం పెద్దలు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కోలారు నియోజకవర్గం విషయంలో స్థానిక బీజేపీ కార్యకర్తల వల్ల కొంత జాప్యం జరిగిన మాట నిజమే అన్నారు. స్థానిక నేతలతో చర్చించి పార్టీ విస్తృత ప్రయోజనాల దృష్ట్యా జేడీఎస్‌కు సహకరించాలని కోరామన్నారు. తాను స్వయంగా మాజీ ప్రధాని దేవెగౌడతోనూ, మాజీ సీఎం కుమారస్వామితోనూ చర్చించానని వివరించారు. టిక్కెట్ల విషయంలో మాజీ సీఎం సదానందగౌడ, మాజీ డీసీఎం కేఎస్ ఈశ్వరప్ప ఒకింత అసంతృప్తితో ఉన్న మాట నిజమేనని, వీరెవ్వరూ కాంగ్రెస్‌లో చేరే ప్రశ్నే లేదన్నారు. అసంతృప్త నేతలను బుజ్జగిస్తున్నామని, ఒకటి రెండు రోజుల్లో అంతా సర్దుకుంటుందన్నారు.

పొత్తు పదిలం : కుమారస్వామి



రాష్ట్ర ప్రయోజనాలకోసమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి పేర్కొన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సమాచార వినిమయంలో జరిగిన గందరగోళం వల్లే కొద్దిగా సమస్య ఏర్పడిందని, ఇప్పుడు అంతా సర్దుకుందన్నారు. మూడు నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లను త్వరలో ప్రకటిస్తామన్నారు. బీజేపీ, జేడీఎస్ కలసికట్టుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటాయన్నారు. కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించడమే తమ ఏకైక లక్ష్యమన్నారు.

దేవెగౌడ అల్లుడు బీజేపీ టికెట్ తీసుకోవడం ఆత్మహత్యా సదృశ్యమే : డీకే

మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ అల్లుడు, పద్మశ్రీ గ్రహీత డాక్టర్ సీఎన్ మంజునాథ్ బీజేపీ టిక్కెట్‌పై పోటీ నిర్ణయం తీసుకున్నప్పుడే జేడీఎస్‌లో తొలి ఆత్మహత్యాయత్నం జరిగిందని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. రెండు, మూడు నియోజకవర్గాల కోసం పార్టీ సిద్ధాంతాలను, లక్షలాదిమంది కార్యకర్తల ఆకాంక్షలను పణంగా పెట్టిన జేడీఎస్ అగ్రనేతల తీరుపై కార్యకర్తల్లో ఆవేశం వెల్లువెత్తుతోందన్నారు.

నేను అత్యంత బలమైన ముఖ్యమంత్రిని

- మీలా బలహీనమైన ప్రధానిని కాదు
- సీఎం సిద్దరామయ్య విసుర్లు

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో సూపర్ సీఎం, షాడో సీఎంలు ఎవరూ లేరని, ఉన్నదల్లా స్ట్రాంగ్ సీఎం ఒక్కరేనని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. శివమొగ్గ ర్యాలీలో సోమవారం ప్రధాని నరేంద్రమోదీ ప్రస్తావించిన ఐదుగురు సీఎంల వ్యాఖ్యలను ఘాటుగా తిప్పికొట్టారు. బెంగళూరులో ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'మోదీజీ.. మిమ్మల్ని మీరు 56 అంగుళాల ఛాతీ ఉన్న నేత అని వర్ణించుకున్నారు. మీ అభిమానులైతే విశ్వగురు అంటూ ఆకాశానికెత్తేస్తారు.. అయితే వాస్తవానికి మీరు అత్యంత బలహీనమైన ప్రధాని అని పదే పదే నిరూపించుకున్నారు' అంటూ విమర్శించారు. గతంలో యడియూరప్ప బాహాటంగానే బీజేపీపై తిరుగుబాటు చేసి మిమ్మల్ని నోటికొచ్చినట్టు తిట్టినా ఆయనను మళ్లీ పార్టీలోకి చేర్చుకున్నారని, మరి ఎవరు బలహీనమో తెలుస్తోందో కదా అంటూ ఎద్దేవా చేశారు. బీజేపీలో అంతర్గత ప్రజాస్వామ్యం నీటిమూటలాంటిదన్నారు. ముఖ్యమంత్రి స్థానానికి ఇతర కీలక పదవులకు బీజేపీలో నేతలే లేనట్టు ఎవరెవరినో తెచ్చి కూర్చోబెడుతున్నారని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ఐదు గ్యారెంటీ పథకాలతో బెంబేలెత్తుతున్న ప్రధాని చివరకు వాటినీ కాపీ కొట్టేస్థాయికి దిగజారారని సీఎం వ్యాఖ్యానించారు.

రేపు ఐఐబీఎస్ సంస్థాపనా దినోత్సవం

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ స్టడీస్ (ఐఐబీఎస్) సంస్థాపనా దినోత్సవం ఈనెల 21న జరగనుంది. సంస్థ అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ త్రిపురనేని జగ్గయ్య ఈ మేరకు నగరంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాక్‌చే ఏ గ్రేడ్ గుర్తింపు పొందిన తమ సంస్థ యూజీసీ ప్రమాణాలకు అనుగుణంగా 16ఏళ్ల మజిలీని విజయవంతంగా పూర్తి చేసుకుందన్నారు. 21న జరిగే సంస్థాపనా దినోత్సవానికి పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. గౌరవ అతిథులుగా విద్యావేత్తలు డాక్టర్ ఆనంద్‌కుమార్, డాక్టర్ ఎం నిర్మల, డాక్టర్ రితికా సింహా పాల్గొంటారని పేర్కొన్నారు. ఇదే సందర్భంగా పలువురు ప్రముఖులను సన్మానించనున్నారు.

నగరత్‌పేటలో ఉద్రిక్తత

- వ్యాపారిపై దాడికి నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ బెంగళూరు నగరంలోని నగరత్‌పేటలో రెండు మతాలకు చెందిన యువకుల మధ్య చోటు చేసుకున్న వివాదం చిలికిచిలికి గాలివానగా మారి ఉద్రిక్తతకు దారి తీసింది. మొబైల్‌షాపులో హనుమాన్‌చాలీసా భక్తి గీతం వివాదం చిలికిచిలికి గాలివానగా మారి రాజకీయ రూపాన్ని సంతరించుకుంది. ఈ దాడికి నిరసనగా నగర బీజేపీ శాఖ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం పెద్ద సంఖ్యలో హిందూ సంఘాల కార్యకర్తలు దాడికి గురైన ముఖేశ్ దుకాణం నుంచి హనుమాన్ చాలీసా పఠిస్తూ ఊరేగింపు నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్యే సురేశ్‌కుమార్, కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, ఎంపీ తేజస్వి సూర్య, పీసీ మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఒకదశలో పోలీసులు ర్యాలీని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా పోలీసు జీపునకు అడ్డుగా వెళ్లిన ఎమ్మెల్యే సురేశ్‌కుమార్‌ను పోలీసులు పక్కకు ఈడ్చేయడం కార్యకర్తల ఆగ్రహానికి దారి తీసింది. పరిస్థితి అదుపు తప్పుతున్న సమయంలో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. ఈ ఘటనకు సంబంధించి హలసూరు గేట్ పోలీసులు తరుణ్, జాహిద్ అనే యువకులను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం కుంబారపేటకు చెందిన సులేమాన్, షాహనవాజ్, రోహిత్‌ను అరెస్టు చేశారు. దీంతో అరెస్టు అయినవారి సంఖ్య 5కు పెరిగింది. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దాడికి పాల్పడిన దుండగులు అందరినీ అరెస్టు చేసేంతవరకు తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ ప్రకటించింది. హిందూ యువకుడు ముఖేశ్‌పై దాడికి నిరసనగా మంగళవారం నగరత్‌పేట బంద్ ప్రశాంతంగా జరిగింది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు.


ర్యాలీగా సాగుతున్న బీజేపీ కార్యకర్తలు





అంకురార్పణ చేస్తున్నఅర్చకులు


అమ్మవార్లతో కలిసి దర్శనమిస్తున్న స్వామివారు

శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

కదిరి, మార్చి 19: శ్రీసత్యసాయి జిల్లా కదిరి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు పట్టణంలోని ఆలయ ప్రాంగణంలో గల యాగశాలలో మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. పక్షం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు ఎటువంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తి అయ్యేలా చూడాలని అష్టదిక్పాలకులను వేడుకోవడం, ఉత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానించే క్రతువునే అంకురార్పణ అంటారు. తొలుత యాగశాలలో పుణ్యాహవచనం నిర్వహించి, శ్రీవారి ఆలయంలో స్వామి వారి సర్వ సైన్యాధ్యక్షుడైన విశ్వక్సేనుడి ఉత్సవ విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆ విగ్రహాన్ని మండపంలో ఆలయ మర్యాదలతో కొలువుదీర్చారు. తర్వాత ఈశాన్య దిక్కుకు వెళ్లి ఉత్సవాలకు ప్రారంభ సూచికగా విశ్వక్సేనుడి సమక్షంలో ప్రధానాచార్యులు భూమాత అనుగ్రహం కోసం భూమికి విశేషమైన ఆరాధన చేశా రు. భక్తిశ్రద్ధలతో మంత్రయుక్తంగా మట్టిని సేకరించి యాగశాలకు చేరుకున్నారు. ప్రధానాచార్యులు బ్రహ్మస్థానంలో ఉండి విశేష ఆరాధనలు చేశారు. తర్వాత యాగశాలలో నిత్యాగ్ని హోత్రాన్ని వెలిగించారు. ఉత్సవాలు ముగిసే వరకు ఈ అగ్నిహోత్రం వెలుగుతూనే ఉంటుంది. కల్యాణోత్సవం నుంచి బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు శ్రీవారు యాగ శాలలోనే కొలువుదీరుతారు. పుట్టమన్ను సేకరించి యాగశాలలో నవధాన్యాలను మొలక పోస్తారు. ఇందులో మొలక ఏ దిక్కున ఎక్కువగా వస్తుందో ఆ దిక్కున పంటలు ఎక్కువగా పండుతాయని భక్తుల నమ్మకం. మొదటి రోజు కార్యక్రమం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సాగింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.46	1,594.85
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	1020
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	765	9,169
సామర్థ్యం (టీఎంసీలు)	5.78	15.56

కనులపండువగా కనకదుర్గమ్మ సిడిబండి రథోత్సవం



● ఆలయం చుట్టూ సిడిబండి రథాన్ని లాగుతున్న ప్రజలు

● తన్మయత్వంతో మొక్కుకుంటున్న భక్తులు

'బళ్లారి దుర్గమ్మా!.. నీవే దిక్కమ్మా!' అంటూ వేడుకుంటున్న భక్తులతో దుర్గామాత ఆలయ ప్రాంగణం మంగళవారం కిటకిట లాడింది. బళ్లారి దుర్గామాత సిడిబండి ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా సాగాయి. మంగళవారం ఉదయం సాంప్రదాయంగా సిడిబండికి పూజలు చేశారు. అంతకు ముందు శనివారం రాత్రి కౌల్‌బజార్‌లోని గానిగ వంశస్తుల ఇంటి నుండి సిడిబండి వచ్చి శనివారం రాత్రి గుడివద్దకు చేరుకుంది. ఉదయం సిడిబండికి పూజలు చేశారు. అనంతరం సాయంత్రం సిడిబండిని దేవాలయం చుట్టూ తిప్పుతూ తిరిగి ఆలయం ఎదుట నిలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బళ్లారి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాగేంద్ర, బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు, తదితరప్రముఖులతో పాటు వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు, ఈవో తదితరులు పాల్గొన్నారు. -బళ్లారి/రూరల్(ఆంధ్రజ్యోతి)

భక్తులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీలో ఫ్రెండ్స్ అసోషియేషన్ సభ్యులు

బళ్లారి సిటీ, మార్చి 19: నగరంలో మంగళవారం కనకదుర్గమ్మ సిడి బండి రథోత్సవం సందర్భంగా ఎస్‌ఆర్‌ఎం ఫ్రెండ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ సిడి బండి రథోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులకు, వడదెబ్బ నుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేశ్, జగన్‌మోహన్‌రెడ్డి, సతీశ్, రవీంద్రారెడ్డి, దివాకర్, మౌలా, షబీర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయరూ..!



వీధిలైట్లు లేని విద్యుత్ స్తంభాలు

సిరుగుప్ప, మార్చి 19: పోలీస్ స్టేషన్ ముందే వీధి లైట్లు ఏర్పాటు చేయని నగరసభ అధికారులపై ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. సిరుగుప్ప పట్టణం గాంధీజీ సర్కిల్ పక్కన పోలీస్ స్టేషన్ ఎదురుగా వున్న రహదారిలో స్తంభాలు మాత్రం నాటారని, వాటికి లైట్లు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కూడలిలోనే ఇలా వుంటే మురికివాడ ప్రాంతాల్లో, ఊరి చివరి ప్రాంతాలపై ఎంతటి నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం అవుతుందన్నారు. ఇకనైనా నగరసభ వీధి లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ



హెల్మెట్లు ధరించి బైకు ర్యాలీ చేస్తున్న పోలీసులు

సిరుగుప్ప,మార్చి19: ప్రతిఒక్క ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలని డీఎస్పీ వెంకటేష్ తెలిపారు. సిరుగుప్ప పట్టణంలో మంగళవారం తహసీల్దార్ షంషాలం ఆధ్వర్యంలో ప్రమాదాల బారిన పడకుండా బైకు వాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరుతూ జనజాగృతి బైకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పోలీసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హెల్మెట్ ధరించడం వలన ప్రమాదాలు జరిగినా ప్రాణనష్టం తక్కువగా వుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐ హనుమంతప్ప, తాలుకా పంచాయతీ ఈవో పవన్ కుమార్, ఎస్ఐ తిమ్మన్న నాయక, పోలీసులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న నగదు స్వాధీనం



నగదును స్వాధీనం చేసుకుంటున్న తహసీల్దార్

గంగావతి రూరల్, మార్చి 19: గంగావతి తాలూకా ఆనేగొంది కడేబాగిలు చెక్‌పోస్టు దగ్గర అక్రమంగా తరలిస్తున్న రూ.35లక్షల, 95వేలు నగదును మంగళవారం పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నగదుతో పాటు కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. నగదును స్వాధీనం చేసుకున్న గంగావతి తహసిల్దార్ నాగరాజు మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా ప్రజలకు డబ్బులు పంచడానికి ఇప్పటినుండే నగదును అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు.

రెయిన్‌బో కళాశాల గౌరవాధ్యక్షుడిగా జేఎన్ గణేష్



గౌరవాధ్యక్షుడిగా ఎన్నికైన ఎమ్మెల్యే గణేషను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

కంప్లి, మార్చి 19 : కంప్లి పట్టణంలోని సన్నాపురం రోడ్డులో నూతనంగా చాంద్ బాషా ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన రెయిన్‌బో ఇంటర్మీడియట్ కళాశాలకు కంప్లి నియోజకవర్గ ఎమ్మెల్యే జేఎన్ గణేష్ గౌరవాధ్యక్షులుగా నియమితులయ్యారు. దీంతో మంగళవారం రెయిన్‌బో ట్రస్టు ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జేఎన్ గణేష్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కంప్లి పట్టణం చుట్టుపక్కల గ్రామాల నుంచి మెరుగైన చదువుల కోసం తమ పిల్లలను గంగావతి, బళ్లారి, హోస్పేట, రాయచూరు, తదితర పట్టణాలకు పంపేవారన్నారు. ఆ తల్లిదండ్రులను దృష్టిలో వుంచుకుని సమాజసేవకుడు, కౌన్సిలర్ చాంద్‌బాషా అందరికీ అనుకూలంగా నూతనంగా సీసీఎంబీ, సీసీఎంపీ, లాంగ్ టర్మ్ కోచింగ్, నీట్, కేసెట్, జేఈఈ తదితర వాటికి శిక్షణతో పాటు హాస్టల్ వసతులు కూడా ఇక్కడ కల్పిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు ఈ కళాశాల సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం కళాశాల కార్యదర్శి చాంద్ బాషా మాట్లాడుతూ తమ నాయకుడుగణేష్ పేద కుటుంబాల వారిని దృష్టిలో వుంచుకుని ఫీజులు తీసుకోవాలని తెలిపారని, అదేవిధంగా విద్యార్థి చదువులు, కుటుంబ ఆర్థిక స్థితిగతులను దృష్టిలో వుంచుకుని, ఇచ్చిన మాట ప్రకారమే ఫీజులు తీసుకుని తమ వంతు సహకరిస్తామన్నారు. పేద కుటుంబాల వారికి, మంచి విజ్ఞానం వున్న విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. పదవ తరగతి విద్యార్థులను రెయిన్‌బో కళాశాలలో చేర్పితే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఫారుక్, మహబూబ్ బాషా, శరణబసవ, షణ్ముఖ, జిలాన్, మునాఫ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను వేధించవద్దు : రైతు సంఘం నాయకులు

కంప్లి, మార్చి 19 : గ్రామీణ బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకు అధికారులు నోటీసులు ఇవ్వరాదని, వారితో చర్చించి రుణాలను రికవరీ చేయాలని రైతు సంఘం నాయకుల కంప్లిలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంతో మంది కర్ణాటక గ్రామీణ బ్యాంకులో రుణాలు తీసుకున్నారన్నారు. రైతులతో చర్చించిన అనంతరమే వడ్డీ, అసలు మొత్తం రుణాలు చెల్లించాలని నోటీసులు జారీచేశారు. ఇందువలన ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఇలా కాకుండా అధికారులు రైతులు సమావేశం ఏర్పాటు చేసి ఎస్‌బీఐ, కెనరా బ్యాంకుల మాదిరిగా వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేపట్టాలన్నారు. ఎంతో మంది కరోనా సమయంలో మరణించడం కూడా జరిగిందని, కావున రైతులకు నోటీసులు ఇవ్వరాదన్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సగమైనా కట్టించుకోవాలని సూచించారు. ఈ సమస్యపై ఈ నెల 28న బళ్లారిలో పెద్దఎత్తున సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని సూచించారు. అనంతరం గ్రామీణ బ్యాంకు అధికారులకు మనవి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి, కలకంబ్ల పంపాపతి, బసవరెడ్డి, సురేంద్ర, కిరణ్‌కుమార్, రఘురామ్, పుష్పవతి, పంపన్న గౌడ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు : కలెక్టర్ మిశ్రా

బళ్లారి సిటీ, మార్చి 19: జిల్లాలోని గ్రామ పంచాయితీల పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఆదేశించారు. కరువు నేపథ్యంలో తాగునీటిపై మున్సిపల్ పట్టణ, ,గ్రామ పంచాయితీ అధికారులతో కేస్వాన్ వీడియో హాల్లో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రతి మున్సిపాలిటి, పట్టణ పంచాయితీ, గ్రామ పంచాయితీల్లో తాగునీటికి మెదటి ప్రాధాన్యమివ్వాలన్నారు. రాబోయే రోజుల్లో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా తాలూకా పాలనా యంత్రాంగం తాగునీటిని ఇతర అవసరాలకు ఉపయోగించరాదన్నారు. కొత్తగా గొట్టపు బావులు తవ్వకుండా ఉన్న గొట్టపు బావులకు మరమ్మతులు చేసి మోటార్లు, పంపులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమమైతే ప్రైవే ట్ బోర్‌వెల్‌లను వినియోగించుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ సెల్ ప్లానింగ్ అధికారులు, మున్సిపాలిటీ, పట్టణ పంచాయితీ, గామపంచాయితీ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

ఈశ్వరప్పను విస్మరిస్తే బీజేపీ ఓటమి తథ్యం

కురుబ సంఘం ప్రధాన కార్యదర్శి మోహన్

బళ్లారి సిటీ, మార్చి 19: వెనుకబడిన వర్గాల నాయకుడు కె.ఎస్.ఈశ్వరప్పకు బీజేపీ అన్యాయం చేసిందని, దీనిపై పోరాటం చేయాలని బళ్లారి కురుబ సంఘం ప్రధాన కార్యదర్శి అల్లీపురం మోహన్ పేర్కొన్నారు. నగరంలోని కురుబ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ ఈశ్వరప్పను బీజేపీ పట్టించుకోకుండా అవమానించిందని మండిపడ్డారు. ఈశ్వరప్పకు శాసనసభ టిక్కెట్ ఇవ్వలేదని, ఇప్పుడు ఆయన కుమారుడిని లోక్‌సభ టిక్కెట్ల పోటీలో తొక్కేస్తున్నారన్నారు. యడ్యూరప్ప పిల్లలు ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాష్ట్ర అధ్యక్షులు అయితే ఈశ్వరప్ప ఎందుకు కాకూడదని ప్రశ్నించారు. సంగొళ్లిరాయన్న బ్రిగేడ్ పెట్టినప్పుడు దానిని మూసివేయాలని అమిత్ షా ఇచ్చిన ఆదేశానికి ఈశ్వరప్ప శిరస్సు వంచి సమస్కరించిన సంగతి తెలియాలన్నారు. యడ్యూరప్ప కొడుకును ఓడించడానికి రాష్ట్రంలోని కురుబలంతా షిమోగా వెళ్లి ప్రచారంలో పాల్గొంటామన్నారు. సదానందగౌడ, కరడి సంగన్న, ప్రతాప్ సింహ తదితరులను తొక్కిపెట్టే పనిలో పార్టీ ఉందన్నారు. కాంతేశ్‌కు హావేరి టిక్కెట్ ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీని బహిష్కరిస్తామన్నారు. సమాజంలో అన్యాయం జరిగినపుడు పార్టీ భేదం మరచి ఈశ్వరప్పకు అండగా నిలుస్తామన్నారు. పార్టీ అధ్యక్షుడు నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రకు లేఖ రాస్తామన్నారు. పార్టీ నిర్మాణానికి జీవితాన్ని అంకితం చేశామన్నారు. కురుబలను దెబ్బతీసే పని చేయవద్దని, లేకుంటే దాని పర్యవసానాలను బీజేపీ ఎదుర్కొవాల్సి ఉంటుందన్నారు. ఈసందర్భంగా కే.మల్లయ్య, నాగరాజు, కంబళి మల్లికార్జున, దమ్మూరు నాగప్ప, శశికళా, కాంత్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కురుబ సంఘం ప్రముఖులు

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఉండాలి

రాయచూరు, మార్చి 19 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులోని అన్ని చెక్‌పోస్టుల్లో పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ ఆదేశించారు. సహాయ ఎన్నికల అధికారులు, ఇతర సిబ్బందితో మంగళవారం జిల్లాధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిన నేపథ్యంలో అన్ని చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాల సౌకర్యం కల్పించాలన్నారు. దీంతో పాటు వాహనాల తనిఖీ సందర్భంగా ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా తనిఖీ కొనసాగాలన్నారు.



సమావేశంలో డీసీ చంద్రశేఖర్ నాయక్

ఇద్దరు పిల్లలకు నిప్పంటించి.. తల్లి ఆత్మహత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బళ్లారి గాంధీనగర్, మార్చి 19: కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలసి ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక సంఘటన మంగళవారం చిత్రదుర్గ జిల్లా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చెళ్ళకెర తాలూకా మల్లసముద్ర గ్రామానికి చెందిన తలారి మారెక్క(24) కుమార్తె నయన(4), కుమారుడు(2)పై పెట్రోలు పోసి నిప్పంటించింది. అనంతరం తనపై కూడా పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మంటల కారణంగా చుట్టు ఉన్న ముళ్ళకంపలు అంటుకోవడంతో ముగ్గురు కాలి బూడిదయ్యారు. ఈ మేరకు తణుకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా వీరభద్రేశ్వరస్వామి రథోత్సవం

కంప్లి, మార్చి 19 : తాలుకా పరిధిలోని సన్నాపురం గ్రామంలో వీరభద్రేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అంతకు ముందు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ప్రతి ఇంటిలోను ఒడి నింపే కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ఆలయం నుంచి ఎదురుబసవన్న కట్ట వరకు రథోత్సవం సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ రథోత్సవంలో చుట్టుపక్కల సన్నాపురం, ఇటిగి, ముద్దాపురం, బెళగోడుహాళ్, కంప్లి, ఎమ్మిగనూరు, కొండయ్య క్యాంపు, బసవేశ్వరక్యాంపు, నారాయణ స్వామి క్యాంపు నుంచి భారీఎత్తున ప్రజలు పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు.



ఊరేగుతున్న వీరభద్రేశ్వరస్వామి

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

రాయచూరు, మార్చి 19: ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభిస్తున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే సూచించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి మంగళవారం జడ్పీ సమావేశం మందిరంలో విద్యాశాఖ అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సభలో మాట్లాడిన సీఈఓ జిల్లాలో 93 కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి కేంద్రంలోను తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు.

హోసూరు జోన్

పశువుల అక్రమ రవాణా.. అడ్డుకున్న పోలీసులు



తరలిస్తున్న పశువులు ఇవే...

హోసూరు, మార్చి 19: హోసూరు సరిహద్దులోని కర్ణాటక ప్రాంతంలో ఆవులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు లారీలను తనిఖీ చేయగా అనుమతి లేకుండా కేరళకు పశువులను తరలిస్తున్నట్లు గుర్తించారు. 20కిపైగా ఆవులను హెబ్బగూడి పోలీసులు స్వాధీనం చేసుకుని పశువుల ఫారానికి తరలించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పాలనలో గోవులను చంపడం జరుగుతోందని పలువురు ఆక్రోశం వ్యక్తం చేశారు. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మద్యం బాటిళ్లు, కారు స్వాధీనం.. ఒకరి అరెస్టు

హోసూరు, మార్చి 19: తమిళనాడులో నిషేధించిన కర్ణాటక మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని కలాల్ పోలీసులు అరెస్టు చేశారు. కృష్ణగిరి జిల్లా శూలగిరి తీర్థం రోడ్డు శివసిగర్లపల్లి సమీపంలో కలాల్ పోలీసు ఇన్‌స్పెక్టర్ షర్మిలాబాను నేతృత్వంలో వాహన తనిఖీలు నిర్వహించారు. బెంగళూరు నుంచి కృష్ణగిరి వైపు అతివేగంతో వస్తున్న కారును ఆపి తనిఖీ చేసి సుమారు రూ.50వేల విలువైన 1200 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారు తిరుపత్తూరులోని పాటలీనగర్ ప్రాంతానికి చెందిన వీరమణి(45)దిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆరు రోజుల తర్వాత విద్యుత్ సరఫరా

హోసూరు, మార్చి 19: హోసూరు నంజుండేశ్వరనగర్ ప్రాంతంలో వారం రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. మరమ్మత్తు చేపట్టి కొత్తది అమర్చారు. అయితే తిరిగి కాలిపోయింది. మళ్లీ కొత్తది సిద్ధం చేసి అందుబాటులోకి తెచ్చినా కొన్ని గంటల్లోనే కాలిపోయింది. దీంతో విద్యుత్ సిబ్బంది స్థానికంగా ఉన్న ప్రతి ఇంటి విద్యుత్ కనెక్షన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి ఆరా తీసి 40 కేవీఏ, 100 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసింది. ఎట్టకేలకు సమస్యను గుర్తించి మంగళవారం నాటికి పరిష్కరించారు. ఇలా ఆరు రోజులపాటు విద్యుత్ లేకపోవడంతో 500కుపైగా కుటుంబాలు ఉన్న ఈ ప్రాంతంలో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు పరిష్కారం కావడంపై నంజుండేశ్వరనగర్ వాసులు విద్యుత్ అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

తనిఖీ చేశాకే వాహనాలకు అనుమతి

హోసూరు (మత్తిగిరి) మార్చి 19: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అన్ని ప్రాంతాల్లోనూ తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రత్యేకించి సరిహద్దులోని చెక్‌పోస్టులలో ఇతర రాష్ట్రాలనుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశాకనే అనుమతిస్తున్నారు. హోసూరులోని అందివాడి, జూజువాడి, కగ్గనూరు, బాగలూరు, బేరికై, అంచెట్టి ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు ఎక్కువగా ఉన్నాయి. సరిహద్దులో 6 అదనపు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిన సంగతి విదితమే. మంగళవారం తమిళనాడు రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన తళి, కర్నూరు, డెంకణీకోట, పూనపల్లి ప్రాంతాల్లో ఎన్నికల అధికారులు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాకనే అనుమతిస్తున్నారు. వాహనాల తనిఖీలకు సంబంధించి వీడియో రికార్డు చేస్తున్నారు.



తనిఖీ చేస్తున్న పోలీసులు

హాస్టల్ విద్యార్థినులకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హాస్టల్ విద్యార్థినులు

రాయచూరు, మార్చి 19: జిల్లాలోని దేవదుర్గ తాలూకా అరకెరా ఎస్టీ హాస్టల్ విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం రాత్రి డిన్నర్‌లో చపాతి, సిరిధాన్యాలను తిన్న 45 మంది విద్యార్థినులు అర్ధరాత్రి వేళ కడుపునొప్పి ఉందంటు వార్డన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే వారిని అరకెరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సనందించారు. కాగా తిరిగి అదే హాస్టల్‌లో ఉదయం అల్పాహారం అనంతరం విద్యార్థులు వాంతులు చేసుకోవడంతో మరోసారి వారికి వైద్య చికిత్సలు అందించారు. ప్రస్తుతం ఎవ్వరికి ఎలాంటి ప్రాణాపాయం లేదని ఫుడ్ పాయిజన్ వల్ల ఈ పరిస్థితి వచ్చిందని అధికారులు అంచనా వేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

బళ్లారి గాంధీనగర్, మార్చి 19: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, లోక్‌సభ ఎన్నికల్లో ఖచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్ల సహాయాధికారి మహ్మద్ ఝుబేర్ తెలిపారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం కెస్వాన్ సభాంగణంలో వివిధ శాఖల అధికారులతో బ్యాలెట్ పేపర్ల పంపిణీకి సంబంధించి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల డ్యూటీలో పాల్గొన్న అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది అంతా ఓటుహక్కు వినియోగించుకోవాలని అందుకు అవసరమైన పోస్టల్ బ్యాలెట్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్న అధికారులు బూత్‌లకు వెళ్లి ఓటు వేయడానికి సాధ్యం కాదని, కావున వారికి ఫారమ్-12 అందజేస్తున్నట్లు తెలిపారు. ఫారమ్ భర్తీ చేసిన అనంతరం వారికి పోస్టల్ బ్యాలెట్ అందజేస్తామన్నారు. అలాగే ఇతర జిల్లాల వారికి కూడా వారి చిరునామాలకు బ్యాలెట్ పంపుతామన్నారు. పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయిన్...

మద్దూరి అన్నపూర్ణయ్య (జయంతి)



'ఆంధ్రా నేతాజీ'గా సుప్రసిద్ధులైన మద్దూరి అన్నపూర్ణయ్య 1899 మార్చి 20న తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం తాలూకా కొమరగిరిలో జన్మించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, పాత్రికేయులు. కాంగ్రెస్, నవశక్తి, జయభారత్, వెలుగు పత్రికలు నడిపి స్వాతంత్ర్యానికి ముందూ, తర్వాత కూడా 'కలం ఖడ్గాన్ని' విశృంఖలంగా ప్రయోగించిన నిస్వార్థ పాత్రికేయుడు. దేశంకోసం 55ఏళ్లు దీక్షగా శ్రమించి 11ఏళ్లపాటు జైలులో గడిపిన మహాత్యాగి. స్వాతంత్ర్యం రాగానే జాడ లేని మహోన్నత నాయకుడిలలో ఒకరు. 1954 సెప్టెంబరు 11న కన్నుమూశారు.

శోభన్‌బాబు (వర్ధంతి)



సోగ్గాడు బిరుదు పొందిన శోభన్‌బాబు 1937 జనవరి 14న కృష్ణా జిల్లా నందిగామలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. అసలు పేరు ఉప్పు శోభనా చలపతి రావు. ప్రేక్షకుల ఆదరాభిమానాలు చూరగొన్న తెలుగు సినిమా కథానాయకుడు. కుటుంబ కథాభరిత చిత్రాలలో ఉదాత్తమైన వ్యక్తిత్వం కలిగిన పాత్రలలో రాణించారు. ఆంధ్రుల అందాల నటుడిగా తెలుగువారి మదిలో నిలిచారు. నటభూషణ బిరుదులు పొందారు. 220కుపైగా సినిమాలలో నటించి 59వ యేట నట జీవితానికి స్వస్తి పలికారు. సినీ రంగంలో ఉన్నా క్రమశిక్షణతో కూడిన జీవితానికి మారుపేరుగా నిలిచారు. 2008 మార్చి 20న కన్నుమూశారు.

అల్కా యాగ్నిక్ (పుట్టినరోజు)



అల్కా యాగ్నిక్ 1966 మార్చి 20న కోల్కత్తాలో జన్మించారు. గుజరాతీ కుటుంబానికి చెందిన ఆమె నేపథ్యగాయనిగా రెండుసార్లు జాతీయ పురస్కారం అందుకున్నారు. నాలుగు దశాబ్దాలలో ఉత్తమ గాయనిగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారానికి 36సార్లు నామినేట్ అయి ఏడుసార్లు పొందారు. 20 భాషలలో వెయ్యికిపైగా సినిమాలలో 20వేలకుపైగా పాటలు పాడారు. అభిమానులు ఆమెను 'ది క్వీన్ ఆఫ్ ప్లేబ్యాక్ సింగింగ్'గా పిలుస్తుంటారు. యూట్యూబ్‌లో మ్యూజిక్ చార్ట్స్ అండ్ ఇన్‌సైట్‌లో టాప్ గ్లోబల్ ఆర్టిస్ట్ జాబితాలో 2022 ఫిబ్రవరిలో నెంబరు వన్ ర్యాంకులో నిలిచి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు పొందారు.

ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్, సిబ్బంది, విద్యార్థులు

పావగడ, మార్చి 19: దేశవ్యాప్తంగా ఏప్రిల్ నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల అధికారి, తహసీల్దార్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పావగడ పట్టణంలో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు విలువను ప్రజలకు తెలియజేశారు. కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 26, మే 7న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. తాలూకా పంచాయతీ కార్యాలయం, సాంఘిక సంక్షేమ కార్యాల యం, బీఈఓ కార్యాల యం తరపున పట్టణ వీధుల్లో ర్యాలీ సాగింది. బీఈఓ ఇం ద్రాణి, ఈఓ జానకిరామ్, సాంఘిక సంక్షేమాధికారి మ ల్లికార్జున, వివిధ పాఠశాలల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 19: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్, ఫార్మసీ పరీక్షల ఫలితాలను విడుదల చేశామని మంగళవారం డైరెక్టర్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపా రు. జనవరి, ఫిబ్రవరిలో బీటెక్ మూ డవ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్20)రెగ్యులర్‌తోపాటు (15,19) సప్లిమెంటరీ నిర్వహించడం జరిగిందన్నా రు. అదేవిధంగా ద్వితీయ సెమిస్టర్(ఆర్20,21,15)పరీక్షలు. ప్రథమ, ద్వితీ య సెమిస్టర్(ఆర్15) లాస్ట్‌ఛాన్స్ పరీక్షలు జరిగాయన్నారు. ఎంఫార్మసీ మూడవ సెమిస్టర్(ఆర్22) రెగ్యులర్, సప్లిమెంటరీ.(ఆర్17) సప్లిమెంటరీతోపాటు ఫార్మాడీ ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం(ఆర్17), తృతీ య సంవత్సరం(ఆర్17) అడ్వాన్స్ ప రీక్షలు నిర్వహించామన్నారు. ఫార్మాడీ(పీబీ) విద్యార్థులకు ప్రథమ, ద్వితీ య సంవత్సరం(ఆర్17) అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయన్నా రు. ఫలితాల కోసం www.jntua.ac.in సందర్శించాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో చిరుత మృతి



మృతి చెందిన చిరుత

కూడేరు, మార్చి 19: మండలంలోని పి. నాగిరెడ్డిపల్లి స మీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చిన దిమ్మెను ఎక్కిన చిరుత విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. స్థానికులు, అటవీశాఖ అధికారులు తెలిపిన మేరకు.. సోమవారం రాత్రి ఓ చిరుత గ్రామ సమీపంలోని బాలరాజు తోట వద్దకు వెళ్లింది. అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఎక్కింది. దీంతో విద్యుత్ షాక్ గురై మృతి చెందింది. మం గళవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్తున్న కొంద రు రైతులు చిరుత మృతి చెందినట్లు గుర్తించి అట వీశా ఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే డీఎఫ్ఓ వినీత్ కుమార్, ఎఫ్ఆర్ఓ శ్రీనివాసులు, డిప్యూటీ రేంజ్ అధికారి హుసేనప్ప, తదితరులు సంఘటన స్థలానికి చేరుకొని చిరుత మృతిపై ఆరా తీశారు. సంఘటన స్థలంలోనే పశువైద్యాధికారి శ్రీనివాసులు చిరుతకు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అక్కడే ఖననం చేశారు.

రోగుల కడుపు నింపుతున్న రోటీ ట్రస్టు

▸▸ ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ఉచిత ఆహారం



ఆహారాన్ని అందిస్తున్న సయ్యద్ గులాబ్

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారితోపాటు వచ్చే బంధువులు ఆహారం కోసం పడే తపన అంతా ఇంతాకాదు. ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రోగుల బంధువులు పడుతున్న కష్టాలకు చలించిన సయ్యద్ గులాబ్ అనే సమాజసేవకుడు రోటీ చారిటీ ట్రస్టు ద్వారా వారి కడుపులు నింపుతూ అందరికీ ఆదర్శప్రాయంగా మారారు. ఇందిరా గాంధీ ఆసుపత్రి, రాజీవ్‌గాంధీ ఆసుపత్రి, సంజయ్‌గాంధీ ఆసుపత్రి, నిమ్హాన్స్ ఆసుపత్రుల వద్ద రోగులు, వారి కుటుంబీకుల కడుపు నింపుతున్న సయ్యద్ ఆకలికి కులం, మతం ఉండదన్నారు. రోగుల బంధువులకే కాకుండా రోగులకు సైతం అవసరమైన ఆహారాన్ని వైద్యుల సలహా సూచన మేరకు ప్రతిరోజూ అందిస్తున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 12 గంటలకు సిద్ధాపుర పోలీస్ స్టేషన్ సమీపంలో వందలాదిమంది సయ్యద్ గులాబ్ వాహనం కోసం ఎదురుచూస్తుంటారు. ఆసుపత్రి గేట్ వద్ద వాహనం నిలపగానే అందరూ క్యూలో నిలబడి ఆహార ప్యాకెట్‌లను స్వీకరిస్తారు. 2016 మార్చిలో రోటి చారిటీ ట్రస్టును ఏర్పాటు చేసిన సయ్యద్ గులాబ్ అప్పటినుంచి ఇప్పటివరకు ఎండా, వానా, చలిని సైతం లెక్కించకుండా పండుగల రోజుల్లో సైతం ఉచిత ఆహార పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఆదివారాలు, పండుగ రోజుల్లో ఆసుపత్రి క్యాంటీన్‌లు ఉండవని, అలాంటి సందర్భంలో ఆహారం కోసం దూరంగా ఉండే హోటళ్లకు రోగిని వదిలి వెళ్లడం కుటుంబీకులకు ఎంతో ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు సయ్యద్ గులాబ్ ఇస్తున్న ఉచిత ఆహారం తమకు వరప్రసాదంగా ఉందని పలువురు అంటున్నారు. ప్రారంభంలో ప్రతి ఆదివారం మాత్రమే 250మందికి ఉచి తంగా ఆహారాన్ని అందించేవాడినని దీన్ని ఫేస్ బుక్‌లోనూ, ఇతర సోషల్‌మీడియాలోనూ షేర్ చేసు కునేవాడి నన్నారు. దీంతో తన సంకల్పాన్ని మెచ్చుకున్న చాలామంది తమ పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాల సమయంలో పేదలకు అన్నదానం చేయాల్సిందిగా రోటి ట్రస్టుకు విరాళాలు ఇచ్చేవారన్నారు. కొవిడ్ వంటి క్లిష్టసమయంలో అయితే రోగులు, వారి బంధువులనే కాకుండా ఎందరో అభాగ్యుల ఆకలిని తీర్చడం ఎంతో సంతృప్తిగా ఉందన్నారు. ఇది దేవుడు తనకు ఇచ్చిన గొప్ప అవకాశంగా భావిస్తున్నట్టు చెప్పారు. కాగా హైదరాబాద్‌కు చెందిన హజర్ మక్కోసి అనే దాత వారానికి ఒకరోజు కాకుండా రోజూ ఆహారాన్ని పంపిణీ చేయాలని అందుకు తాను సహకరిస్తానని భరోసా ఇవ్వడంతో ఇప్పుడు దీన్ని నిత్యం కొనసాగిస్తున్నానన్నారు. చిన్నచిన్న రియల్ వ్యాపారాలు చేసుకునేవా సయ్యద్ గులాబ్ నగరంలో ప్రభుత్వ ఆసుపత్రుల రోగుల, బంధువుల పాలిట దేవుడిగా మారారు.

పట్టుగూళ్లకు కనీసధర ప్రకటించండి



పట్టుశాఖ అధికారి మహదేవయ్యకు వినతిపత్రం అందజేత

శిడ్లఘట్ట, మార్చి 19: నియోజకవర్గంలోనే కాకు చుట్టుపక్కల ప్రాంతాల్లో పట్టు పరిశ్రమపై ఆధారపడి వేలాదిమంది జీవనం సాగిస్తున్నారు. తాలూకాలోని పట్టుగూళ్ల మార్కెట్ ఆసియా ఖండంలోనే పేరొందింది. 15రోజుల క్రితంవరకు పట్టుగూళ్ల ధర కిలో రూ.500-700 మధ్య పలికింది. అయితే క్రమంగా ధర తగ్గుతూ వస్తోంది. రెండు రోజులుగా రూ.300-350కు పడిపోయింది. పట్టుగూళ్లనే నమ్ముకున్న రైతులు దీంతో ఒక్కసారిగా దిగాలు చెందారు. మంగళవారం పట్టు రైతులు స్థానిక పట్టుమార్కెట్ డిప్యూటీ డైరెక్టర్ మహదేవయ్యకు వినతిపత్రం సమర్పించారు. కనీస ధర కిలో రూ.600గా ప్రకటించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతకంటే తక్కువ పలికితే సబ్సిడీ రూపంలో రైతులకు ఇవ్వాలని రాష్ట్ర రైతుసంఘం, హసిరుసేన డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి భక్తరహళ్ళి ప్రతీశ్, తాలూకా అధ్యక్షుడు మునేగౌడ, కార్యదర్శి నవీనచార్య, హిరేపాళ్య హెచ్. ఎన్ కదిరేగౌడ, ఆంజినప్ప, డీవీ నారాయణస్వామి, అరుణ్, బళువనహళ్ళి ప్రకాశ్, మాళమాచనహళ్ళి రమేశ్, మంజునాథ్, శ్రీరామప్ప, దొడ్డతేకహళ్ళి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



పాల్గొన్న విద్యార్థుల బృందం

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు సుంకదకట్టెలోని శ్రీనివాస నగర్‌లోగల అంజలి కాన్వెంట్, నైటింగేల్ ఉన్నత పాఠశాల క్యాంపస్‌లో పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంస్థ కార్యదర్శి ఎంఎస్ సరళ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బీ కృష్ణేగౌడ అధ్యక్షత వహించారు. సంస్థ చైర్మన్ ఎస్‌జీ గౌడ మాట్లాడుతూ ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో బాగా రాణించి ఉత్తమ మార్కులతో రాణించాలని విద్యార్థులకు సూచించి ఆశీర్వదించారు. తమ పాఠశాలలో జ్ఞానసముపార్జనతోపాటు క్రీడలు, మానసిక వికాసం, క్రమశిక్షణ, నైతిక విలువలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. పరీక్షల్లో ఎలాంటి ఒత్తిళ్లకు లోను కావద్దని విద్యార్థులకు ప్రిన్సిపాల్ కృష్ణేగౌడ సూచించి కొన్ని చిట్కాలు చెప్పారు. ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో టాప్ ఐదు ర్యాంకులు సాధించే విద్యార్థులకు ఫీజులను వాపసు చేస్తామని, స్వాతంత్ర్య దినోత్సవాన ఘనంగా సన్మానిస్తామన్నారు. తొలుత ఉపాధ్యాయురాలు లక్ష్మీ స్వాగతం పలకగా, ఉపాధ్యాయుడు ఏఆర్ రఘురాం వందన సమర్పణ చేశారు.

ఓటు హక్కుపై వినూత్నంగా జాగృతి



దివిటీలతో ర్యాలీ.. పాల్గొన్న జిల్లా అధికారి అక్రంపాషా

బంగారపేట, మార్చి 19: కోలారు జిల్లా బంగారపేట శాసనసభ నియోజకవర్గంలో గతంలో తక్కువ పోలింగ్‌శాతం నమోదైన వార్డులను గుర్తించి ప్రజలను చైతన్యం తెచ్చేలా కార్యక్రమాలు చేపట్టినట్టు జిల్లా అధికారి అక్రంపాషా తెలిపారు. సోమవారం రాత్రి దివిటీల ద్వారా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని తాలూకా పంచాయతీ వద్ద జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, తాలూకా యంత్రాంగం, పురసభ సంయుక్త ఆధ్వర్యంలో కోలారు జిల్లా స్వీప్ సమితి నేతృత్వంలో దివిటీలతో జాగృతి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రజలు తమ విలువైన ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కోలారు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ జాగృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. తాలూకా పంచాయతీ ఈఓ రవికుమార్ నేతృత్వంలో ర్యాలీ సాగింది. జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి, తహసీల్దార్ రశ్మి, పురసభ ముఖ్య అధికారి మీనాక్షి, తాలూకాస్థాయి అధికారులు పాల్గొన్నారు. పీడీఓలు, పురసభ ఉద్యోగులు, వాటర్‌మ్యాన్‌లు, 21 పంచాయతీల సిబ్బంది, పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

22 నుంచి ఏకత్వం హోలీ మ్యూజిక్ ఫెస్టివల్



పాల్గొననున్న కళాకారులు

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఏకత్వం ఎన్ ట్రస్టు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వార్షిక హోలీ సంగీత ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈనెల 22 నుంచి 25వరకు నాలుగు రోజులలో 7 సంగీత కంచేరీలు, 2 పురస్కార ప్రదాన కార్యక్రమాలు బసవనగుడిలోని గాయన సమాజలో జరగనున్నాయి. సంగీతాభిలాషులకు ప్రవేశం ఉచితమని నిర్వాహకులు తెలిపారు. కర్ణాటక గాత్రసంగీతం, డ్యూయెట్, కర్ణాటిక్ ఫ్యూజన్ బ్యాండ్, హిందూస్తాని ఓకల్ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. భారతీయ శాస్త్రీయ సంగీత, సాంస్కృతిక పరంపర సంరక్షణలో భాగంగా సంగీత ఉత్స వాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. సంప్రదాయాలకు భంగం వాటిల్లకుండా కొత్తదనంతో సమకాలీనకు అనుగుణంగా సంగీత కార్యక్రమాలు ఉంటాయని, సీనియర్ కళాకారులు తమ ప్రతిభను చాటుకోనుండగా వర్ధమాన కళాకారులకు కూడా అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. 2022లో ఏకత్వం కర్ణాటక పేరిట ప్రముఖ సంగీత కళా కారులకు పురస్కారాలతో గౌరవించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

కార్యాలయాలపై ప్రకటనల తొలగింపు



ప్రకటనలకు రంగు వేస్తున్న సిబ్బంది

చింతామణి, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పట్టణ, తాలూకా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రకటనలు, ప్రభుత్వ సాధనల బ్యానర్‌లు సహా వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, గోడలపై ప్రకటనలను తొలగించే ప్రక్రియ వేగిరం చేశారు. ఎన్నికల కమిషన్ సూచనతో అధికారులు, సిబ్బంది కార్యాచరణను ముమ్మరం చేశారు. లోక్‌సభ, శాసనసభ, పరిషత్ సభ్యులు తమ ప్రాంతీయ క్షేత్రాభివృద్ధి నిధులనుంచి నిర్మించిన కట్టడాలు, ప్రహరీ, తదితర పనులకు సంబంధించి ఉన్న నామఫలకాలను మూసివేసేలా నగరసభ సిద్ధమైంది. పోలింగ్ కేంద్రాలపై సమాజసేవకుల పేరిట రాతలు, పార్టీ చిహ్నాలను తొలగించనున్నారు. కాగా శాంతి భద్రతల దృష్ట్యా లైసెన్స్ కల్గిన ఆయుధాలను తమ పరిధిలోని రూరల్, పట్టణ పోలీస్ స్టేషన్‌లలో డిపాజిట్ చేసి రసీదు తీసుకోవాలని ఆదేశించారు.

పొగాకు నిషేధంపై జాగృతి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

శిడ్లఘట్ట, మార్చి 19: పొగాకు నిషేధంపై పట్టణంలో ప్రత్యేక జాగృతి నిర్వహించారు. పలు దుకాణదారులకు కరపత్రాలు అందచేసి అవగాహన కల్పించారు. అలాగే నిబంధనలు ఉల్లంఘించినవారికి జరిమానా విధించారు. ధూమపానం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. పట్టణంలో కోప్టా సెక్షన్ 4 కింద 14 కేసులలో రూ.1350, కోప్టా సెక్షన్ 6 కింద 6 కేసులలో రూ.1950 జరిమానా విధించారు. తాలూకా ఆరోగ్యశాఖ అధికారి దేవరాజ్, మంజునాథ్, సునిల్‌కుమార్, ధనంజయ్, పోలీసుశాఖ నుంచి అనితా, నగరసభనుంచి ముక్త, భావన, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నృసింహుడి కల్యాణోత్సవం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కదిరి, మార్చి 19: బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న లక్ష్మీ నృసింహ స్వామి వారి కల్యాణోత్సవం బుధవారం శ్రీసత్యసాయి జిల్లా కదిరి ఆలయ ప్రాంగణంలో కన్నుల పండువగా జరగనుంది. అంతకు ముందు ఉదయమే ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఉత్సవాలకు అధిపతి అయిన గరుడాళ్వార్‌ను ధ్వజారోహణం గావించడమే ఈ వేడుక ప్రాముఖ్యత. నేడు ఆరోహణం గావించిన గరుడాళ్వార్‌ను ఉత్సవాలు ముగిసే వరకు అలాగే ఉంచి, తీర్థవాది రోజున అవరోహణం గావిస్తారు. ఈ వేడుకను తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలి రానున్నారు. తొలుత యాగశాల నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వేర్వేరుగా పల్లకీల్లో కల్యాణ మండపానికి తీసుకొస్తారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీవారి ప్రతిరూపమైన కంకణ భట్టాచార్యుల వారు అమ్మవార్లకు మాంగల్యధారణ గావిస్తారు. దీంతో ఉత్సవం ముగుస్తుంది. సాధారణ వివాహాలలో మాదిరిగానే నారసింహుడి కల్యాణంలో కూడా తలంబ్రాలు పోసుకోవడం, వివాహ వేడుకకు హాజరైన వారు వధూవరులకు చదివింపులు సమర్పించడం అనాదిగా వస్తోంది. సాక్షాత్తూ బ్రహ్మదేవుడే ఈ ఉత్సవాలను ముందుండి నడిపిస్తారని, అందుకే వీటిని బ్రహ్మోత్సవాలని పేరు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల సమేత నారసింహుడి కల్యాణం తిలకించడానికి ముక్కోటి దేవతలు విచ్చేస్తారని భక్తుల నమ్మకం. నేటి సాయంత్రం జరుగనున్న ఈ ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణమంతా అత్యంత సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల గురించి అందరికీ తెలిసే విధంగా పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో విద్యుద్దీపాలతో స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు.

గ్యారెంటీ పథకాల కమిటీ ఉపాధ్యక్షుడిగా జనార్దన్



జనార్దన్

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె పరిధిలో గ్యారంటీ పథకాల అమలుకోసం ఏర్పాటైన కమిటీకి బసవేశ్వరనగర్‌కు చెందిన జనార్దన్ ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గ్యారంటీ పథకాల అమలు ప్రాధికార కార్యదర్శి డా. జీసీ ప్రకాష్ నగరంలో మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తన సేవలను గుర్తించి కీలక బాధ్యతలను అప్పగించినందుకు ప్రభుత్వానికి జనార్దన్ ధన్యవాదాలు తెలిపారు. ప్రజలందరికీ గ్యారెంటీ పథకాలు అందేలా కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ గ్యారంటీ పథకాలతో రాష్ట్రంలో నిరుపేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు బాగా మెరుగుపడ్డాయని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కాంగ్రెస్‌ను లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తారన్న నమ్మకం తమకు ఉందని జనార్ధన్ ప్రకటనలో పేర్కొన్నారు.

బెంగళూరు సంస్థతో కీలక ఒప్పందం

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ప్రధాన కేంద్రంగా సేవలందిస్తున్న ఒమేగా ఇన్నోవేటివ్ సొల్యూషన్స్‌తో ఫైండ్ మై ప్లాట్స్ డాట్‌కాం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఇళ్ల స్థలాలు, ఇళ్లు, ప్లాట్లు, విల్లాలు, ఫాం హౌస్‌ల క్రయ విక్రయాలను వేగవంతం చేసేందుకు ఈ ఒప్పందం ఎంతగానో దోహదపడనుందని ఉభయ సంస్థల ప్రతినిధులు అయాబ్ ఉర్ రెహ్మాన్, ఆదిత్యన్ నగరంలో మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. క్రయ విక్రయాల్లో పూర్తిస్థాయి పారదర్శకతను సాధించే దిశలో ఆస్తులకు సంబంధించి దస్తాలను వెబ్‌సైట్ల ద్వారా తమ సంస్థ ప్రతినిధులు విస్తృతంగా తనిఖీలు చేస్తారని ప్రకటనలో పేర్కొన్నారు. మోసాల నివారణకు ఇది చక్కటి విధానమని భావిస్తున్నట్లు తెలిపారు

నేడు కెన్నెడియా బ్లూకేఫ్ ప్రారంభం

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి కప్పూ ఒక మధురానుభూతిని సృష్టిస్తుందనే నినాదంతో సిద్ధమైన కెన్నెడియా బ్లూ కేఫ్ బుధవారం లాంఛనంగా ప్రారంభం కానుంది. ఈ మేరకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా జై ప్రకాష్ నగరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. చిక్కబళ్లాపురలోని మారతహళ్ళి సమీపాన గల కాసవనహళ్ళి గ్రామంలో జాతీయ రహదారి 44 మార్గంలో ఏర్పాటైన ఈ కెఫెను రాష్ట్ర అబకారి శాఖా మంత్రి ఆర్‌బీ తిమ్మాపుర ప్రారంభించనుండగా ప్రపంచపు అతి పిన్న వయసు గల మోటివేషనల్ స్పీకర్ అభిత్ కెన్నెడియా ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ప్రకటనలో తెలిపారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో రుచులకు ప్రాధాన్యతనిచ్చేలా ఈ కెఫెకు రూపకల్పన చేశామని ప్రకటనలో పేర్కొన్నారు.


21నుంచి 'బెందకాళు ఆన్ టోస్ట్'



నాటకంలో సన్నివేశం (ఫైల్)

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత నటుడు గిరీశ్ కర్నాడ్ రచించిన బహుళ ప్రజాదరణ పొందిన నాటకాలలో ఒకటైన బెందకాళు ఆన్ టోస్ట్‌ను నగరంలో ఈనెల 21, 22 తేదీలలో ప్రదర్శించనున్నారు. ఈ నాటకానికి ఎస్ సురేంద్రనాథ్ దర్శకత్వం వహిస్తుండగా ఎన్ఎస్ సత్యు స్టేజ్ డెకరేషన్ తీర్చిదిద్దనున్నారు. జేపీ నగర్‌లోని రంగశంకరలో ప్రతిరోజూ సాయంత్రం 7.30 గంటలకు నాటక ప్రదర్శన జరగనుంది. నాటకంలో బెంగళూరు నగర చరిత్రను, నేపథ్యాన్ని కళ్లకు కట్టినట్టు చూపడం విశేషం. బెంగళూరు నగర చరిత్రను, విశిష్టతను తెలుసు కునేందుకు ఈ నాటకం బాగా దోహదపడుతుందని నిర్వాహకులు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

నగరసభ కమిషనర్‌గా మాధవి



కమిషనర్ మాధవి

చింతామణి, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నగరసభ కమిషనర్‌గా సేవలందించి బదిలీ అయిన జీఎన్ చలపతి స్థానంలో నూతన కమిషనర్ నియ మితులయ్యారు. చిక్కబళ్లాపుర జిల్లా నగరాభివృద్ధి విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే మాధవిని నూతన కమిషనర్‌గా నియమించారు. చింతామణి నగరసభ కమిషనర్‌గా ఆమె మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో నీటి ఎద్దడి సమస్యపై తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు.